సాక్షి కామారెడ్డి

బుధవారం : 31 : జనవరి : 2024



వరిలో సస్యరక్షణ

వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారు. పంటలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

- 8లో ▸



పథకం ప్రకారమే..

తాడ్వాయి మండలంలోని సోమారం శివారులో ఈనెల 21వ తేదీన జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం


31.6 /14.5

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత కాస్త తగ్గవచ్చు.

నిండుకున్న ఖజానా!

ఆదాయ మార్గాలపై పాలకులు, అధికారులు దృష్టి సారించకపోవడంతో కామారెడ్డి బల్దియా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఉన్న నిధులను ఇష్టారాజ్యంగా ఖర్చు చేశారు. ఖజానా ఖాళీ కావడంతో కార్మికులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి కూడా లేకుండాపోయింది. దీంతో కార్మికులు ఆందోళనబాట పట్టారు. మరోవైపు కరెంటు బిల్లుల బకాయిలు కొండంత పేరుకుపోయాయి.



- ఆర్థిక సంక్షోభంలో కామారెడ్డి మున్సిపాలిటీ
- కార్మికులకు వేతనాలు ఇవ్వలేని దుస్థితి
- మూడేళ్లుగా కార్మికుల పీఎఫ్ డబ్బులూ జమ చేయని వైనం
- విద్యుత్ బిల్లుల బకాయిలు రూ. 16 కోట్లపైమాటే..
- ఇప్పటికే నోటీసులు ఇచ్చిన ట్రాన్స్‌కో అధికారులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి బల్దియాకు ఆస్తి, కుళాయి, ఇతర పన్నుల రూపంలో ఏటా రూ. 8 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుంది. ఈ నిధులను కార్మికుల వేతనాలు, కరంటు బిల్లులు, అత్యవసర పనులకు జనరల్ ఫండ్ పేరిట వినియోగించాల్సి ఉంటుంది. కానీ బల్దియా పాలకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి సంబంధించిన బిల్లుల చెల్లింపులకు జనరల్ ఫండ్‌ను వాడినట్లు తెలుస్తోంది. ఇలా నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా డబ్బులు ఖర్చు చేయడంతో ఖజానా ఖాళీ అయ్యింది. మరోవైపు ఆదాయ వనరుల సృష్టిపై బల్దియా అధికారులు దృష్టి సారించకపోవడంతో కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది.

రెండు నెలలుగా వేతనాలు రాక..

మున్సిపల్‌లో సానిటేషన్ కార్మికులు 153 మంది, విలీన గ్రామాల్లో 80, ఇతర విభాగాల్లో 100, వాటర్ వర్క్స్‌లో 118, రూరల్‌లో 28, కార్యాలయంలో 12 మంది, కళాభారతిలో ఆరుగురు, కంప్యూటర్ విభాగంలో 15 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి వేతనాలకోసం ప్రతినెలా రూ. 65 లక్షలకు పైగా అవసరం. ఖజానా నిండుకోవడంతో కార్మికులకు రెండునెలలుగా వేతనాలు చెల్లించడం లేదు. వేతనాలు రాకపోవడంతో కార్మికులు మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. వారితో ఎమ్మెల్యే వీడియో కాల్ ద్వారా మాట్లాడారు. బల్దియా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు ప్రత్యేక సమావేశం

కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద కార్మికులు ఆందోళన చేయడంతో ఆయన స్పందించారు. బల్దియా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల వేతనాలు ఆపొద్దని గత నెల జరిగిన కౌన్సిల్ సమావేశంలోనే కేవీఆర్ హెచ్చరించారు. అయినా వేతనాలు ఇవ్వకపోవడంతో ఆగ్రహంతో ఉన్నారు. బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో సమావేశమై బల్దియా ఆర్థిక పరిస్థితిపై సమీక్షించనున్నారు.

పీఎఫ్ బకాయిలు రూ. 4 కోట్లకుపైనే..

మున్సిపల్ కార్మికులకు సంబంధించిన పీఎఫ్ ఖాతాలలో మూడేళ్లుగా డబ్బులు జమ చేయడం లేదు. ఈ బకాయిలు రూ. 4 కోట్లకుపైనే ఉన్నాయి. ఫిబ్రవరిలోనూ స్పందించకపోతే రూ. 30 లక్షలకు పైగా జరిమానా విధించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. అలాగే కార్మికుల ఈఎస్ఐ ప్రీమియం కూడా చెల్లించడం లేదు.

కొండంతగా విద్యుత్ బిల్లుల బకాయిలు..

కామారెడ్డి మున్సిపాలిటీలోని వీధి దీపాలు, సెంట్రల్ లైటింగ్, నీటి సరఫరా, కార్యాలయానికి సంబంధించిన విద్యుత్ బిల్లులను కూడా రెండున్నరేళ్లుగా చెల్లించడం లేదు. విద్యుత్ బిల్లులకు సంబంధించి రూ. 16.68 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఇటీవల ట్రాన్స్ అధికారులు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి, నోటీసు అందించారు. బిల్లులు చెల్లించకపోతే కార్యాలయానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. అయితే విద్యుత్ శాఖ రూ. 16 లక్షల వరకు ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంది. ఆ మొత్తాన్ని విద్యుత్ బిల్లుల బకాయి కింద సర్దుబాటు చేశారు.

రిపేర్‌కు నోచుకోని చెత్త సేకరణ ఆటోలు

ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించడం కోసం వినియోగించే ఆటోలు బల్దియాలో 22 ఉన్నాయి. అయితే దాదాపు అన్ని వాహనాలు చెడిపోతున్నాయి. ఆటోలు పాడైపోయి ఎక్కడపడితే అక్కడ ఆగిపోతున్నాయని డ్రైవర్లు పేర్కొంటున్నారు. మరమ్మతులు చేయించాలని కోరుతున్నా బల్దియా అధికారులు పట్టించుకోవడం లేదు.

> **రెండుమూడు రోజుల్లో చెల్లిస్తాం**
>
> 
>
> పట్టణంలో రూ. 3.60 కోట్ల పన్నులు వసూలు కావాల్సి ఉంది. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పన్నులు వసూలు చేస్తాం. కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వేతనాలను రెండు మూడు రోజుల్లో చెల్లిస్తాం. పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలూ జమ చేస్తాం.
>
> – దేవేందర్, మున్సిపల్ కమిషనర్, కామారెడ్డి

వెంటనే వేతనాలు చెల్లించాలి..

- కామారెడ్డి బల్దియా కార్మికుల డిమాండ్
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ధర్నా
- వీడియో కాల్ ద్వారా నచ్చజెప్పిన కేవీఆర్

కామారెడ్డి టౌన్: వెంటనే వేతన బకాయిలను చెల్లించాలని కామారెడ్డి మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో మంగళవారం ఉదయం విధులను బహిష్కరించి, జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి వీడియో కాల్ ద్వారా కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కార్మికులు తమ వెతలను ఆయనతో వెల్లబోసుకున్నారు. పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించడం లేదన్నారు. వేతనాలకోసం కమిషనర్‌ను వేడుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన ఆయన బుధవారం ఉదయం 10 గంటలకు క్యాంపు కార్యాలయంలో అధికారులతో ఎమర్జెన్సీ మీటింగ్ నిర్వహిస్తానన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బల్దియా కార్మికులు

పరీక్షలను సజావుగా నిర్వహించాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు, అధికారులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ గురువారంనుంచి ప్రాక్టికల్ ఎగ్జామ్స్ ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు ఉంటాయన్నారు. అభ్యర్థులు ఒక గంట ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. థియరీ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి మార్చ్ 14 వరకు జరుగుతాయన్నారు. పరీక్షల నిర్వహణకు కామారెడ్డి, బిచ్కుంద, బాన్సువాడలలో 50 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్ష పేపర్లను ఓపెన్ చేయాలని సూచించారు. కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇంటర్ బోర్డు నోడల్ అధికారి షేక్ సలాం, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు శ్రీనాథ్, నాగేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీకి ఘన నివాళి

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్‌లో మంగళవారం మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ మహనీయులు చూపిన బాటలో నడవాలన్నారు. అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం, ఉద్యోగులు పాల్గొన్నారు.

టీఎస్ఆర్‌జేసీ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

లింగంపేట: తెలంగాణ గురుకుల విద్యా సంస్థల ఆధ్వర్యంలోని 35 గురుకుల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ తారాసింగ్ తెలిపారు. ఆసక్తి గలవారు వచ్చేనెల 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 98665 58693 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్

పంచాయతీరాజ్‌లోనూ బదిలీలకు కసరత్తు!

- బదిలీకానున్న డీఎల్పీవోలు, ఎంపీడీవోలు

సాక్షి, కామారెడ్డి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖలోనూ బదిలీలు జరిగే అవకాశాలున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రెవెన్యూ, పోలీసు శాఖల్లో బదిలీలు జరగ్గా, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మూడేళ్లుగా జిల్లాలో కొనసాగుతున్న వారిని, అలాగే సొంత జిల్లాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారిని బదిలీ చేయనున్నట్లు తెలుస్తోంది. డీపీవో శ్రీనివాస్‌రావు వచ్చి మూడేళ్లు కాలేదు. అలాగే డీఆర్‌డీవో సాయన్న మధ్యలో కొంత కాలం బదిలీపై వెళ్లి వచ్చారు. దీంతో వీరిద్దరికీ బదిలీనుంచి మినహాయింపు ఉండే అవకాశాలున్నాయి. కామారెడ్డి, బాన్సువాడ డీఎల్పీవోలు జిల్లాలో మూడేళ్లకుపైగా పనిచేస్తుండడంతో వారిని బదిలీ చేస్తారని తెలుస్తోంది. జిల్లాలో 22 మండలాలుండగా 16 మందే ఎంపీడీవోలున్నారు. వారిలో 13 మంది బదిలీ అయ్యే అవకాశాలున్నాయి. ఫిబ్రవరి 10 లోపు బదిలీలు జరుగుతాయని భావిస్తున్నారు. సొంత జిల్లాలో, అలాగే ఉద్యోగం చేస్తున్న జిల్లాలో కాకుండా ఇతర జిల్లాలకు బదిలీ చేస్తారని సమాచారం.

సలాబత్‌పూర్ ఆలయాన్ని దర్శించుకున్న కేంద్ర మంత్రి



మద్నూర్: సలాబత్‌పూర్‌లోని హనుమాన్ ఆలయాన్ని మంగళవారం రాత్రి కేంద్ర సహాయ మంత్రి భగవంత్ ఖూబా దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా మద్నూర్‌కు చెందిన తమ్మెవార్ అజయ్ కేంద్ర సహాయ మంత్రికి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైరంన్ నర్సింలుగౌడ్ పాల్గొన్నారు.

'అప్రమత్తతతో ప్రమాదాల నివారణ'



నిజాంసాగర్: చేపల వేట సమయంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి పేర్కొన్నారు. అచ్చంపేట రైతు వేదికలో జాతీయ మత్స్య శాఖ ఆధ్వర్యంలో మత్స్యకారులకు ఇస్తున్న శిక్షణ కొనసాగుతోంది. మంగళవారం రెండోరోజు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వలలు విసరడం, వలలు ఎత్తడం, తెప్పపైన ప్రయాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు ఇచ్చారు.

'ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు'



సదాశివనగర్: ఎరువులను ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం ఆమె గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీతోపాటు పలు గ్రామాలలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఎరువులు తీసుకున్న రైతులకు తప్పకుండా బిల్లులు ఇవ్వాలని సూచించారు. దుకాణాల్లో స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో గాయత్రి షుగర్స్ ఏజీఎం రామదాస్, సింగిల్ విండో సీఈవోలు కడెం భైరయ్య, దేవేందర్, విండో సిబ్బంది భైరేశ్, భరత్, లింగమూర్తి, గంగారాజు తదితరులు పాల్గొన్నారు.


నేడు స్టాఫ్ నర్సులకు ప్రొసీడింగ్‌లు

నిజామాబాద్ రూరల్: జిల్లా పరిధిలో స్టాఫ్ నర్సులుగా ఎంపికైన 380 మందికి బుధవారం ప్రొసీడింగ్‌లు ఇవ్వనున్నట్లు జిల్లా వైద్యాధికారి సుదర్శనం తెలిపారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సీఎం చేతులమీదుగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. 380 మందిలో నలుగురికి దివ్యాంగుల కోటాలో ఉద్యోగాలు వచ్చాయన్నారు.

ఎల్లారెడ్డిలోనూ రోజ్‌గోల్డ్ బాధితులు

నాగిరెడ్డిపేట: బ్యూటీపార్లర్ల బిజినెస్ ద్వారా ఉపాధి కల్పించడంతోపాటు నెలనెలా జీతం ఇస్తామని నమ్మించి, రూ. కోట్లు దండుకుని ఉడాయించిన రోజ్ గోల్డ్ సంస్థ బాధితుల్లో ఎల్లారెడ్డి వాసులూ ఉన్నారు. పలువురు లక్షల్లో పోగొట్టుకుని లబోదిబోమంటున్నారు. వివరాలిలా ఉన్నాయి. రోజ్‌గోల్డ్ నిర్వాహకులు బ్యూటీపార్లర్ బిజినెస్‌ల ద్వారా ఉపాధి కల్పించడంతోపాటు నెలనెలా జీతం ఇస్తామని నమ్మించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, లింగంపేట, గాంధారి మండలాల్లో రోజ్‌గోల్డ్ ఫ్రాంచైజీలను ఏర్పాటు చేయడంలో నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట్‌కు చెందిన ఒకరు మధ్యవర్తిత్వం వహించినట్లు తెలిసింది. రోజ్‌గోల్డ్ బ్యూటీపార్లర్ల ద్వారా ఉపాధి పొందడంతోపాటు నెలనెలా రూ. 35 వేల వేతనం కూడా వస్తుందని చెప్పడంతో చాలామంది ఫ్రాంచైజీ తీసుకోవడానికి ముందుకు వచ్చారు. రోజ్‌గోల్డ్ నిర్వాహకులు సదరు మధ్యవర్తి ద్వారా ఒక్కో ఫ్రాంచైజీ కోసం ఒక్కొక్కరి వద్దనుంచి రూ.3.50 లక్షల వరకు వసూలు చేసినట్లు తెలిసింది. ఇలా నిరుద్యోగుల నుంచి రూ. లక్షల్లో వసూలు చేసిన రోజ్‌గోల్డ్ సంస్థ నిర్వాహకులు రెండునెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతోపాటు వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ వస్తుండడంతో ఫ్రాంచైజీలు తీసుకున్నవారు ఆందోళన చెందుతున్నారు. రోజ్‌గోల్డ్ నిర్వాహకులపై పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు కావడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తాము గోపాల్‌పేటకు చెందిన యువకుడిని నమ్మి డబ్బులు చెల్లించామని, అతడే తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. బాధితులు ఈ విషయమై ఎస్పీకి సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

కొత్త భవనంలోకి కోనాపూర్ పాఠశాల



సాక్షి, కామారెడ్డి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కోనాపూర్‌లో ఆధునిక హంగులతో నిర్మించిన పాఠశాల భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. కేటీఆర్ తన నాయినమ్మ కల్వకుంట్ల వెంకటమ్మ పుట్టిపెరిగిన కోనాపూర్ గ్రామంలో సొంత డబ్బులతో ప్రాథమిక పాఠశాల భవనం నిర్మించిన విషయం తెలిసిందే. భవన నిర్మాణం ఎప్పుడో పూర్తయినా ప్రారంభోత్సవం వాయిదా పడుతూ వచ్చింది. అయితే కొత్త భవనం కోసం పాఠశాల పాత నిర్మాణాన్ని కూల్చివేయడంతో అప్పటినుంచి పంచాయతీ భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కొత్త భవనంలోకి పాఠశాలను మార్చాలని గ్రామస్తులు నిర్ణయించారు. బుధవారం నుంచి కొత్త భవనంలో ప్రాథమిక పాఠశాల తరగతులు నిర్వహించనున్నారు.

నకిలీ పాస్‌పోర్టుల కేసులో ఎస్‌బీ ఏఎస్సై అరెస్ట్

- అదుపులోకి తీసుకున్న సీఐడీ పోలీసులు
- సర్టిఫికెట్లను పరిశీలించకుండానే పాస్‌పోర్టులకు క్లియరెన్స్ ఇచ్చినందుకు..

ఖలీల్‌వాడి: నకిలీ పాస్‌పోర్టుల కేసులో సీఐడీ దర్యాప్తును ముమ్మరం చేస్తోంది. ఇప్పటికే ఈనెల 19న నిజామాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న భీమ్‌గల్ పట్టణానికి చెందిన పాస్‌పోర్టు ఏజెంట్ సుభాష్‌ను సీఐడీ అధికారులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దీంతోపాటు అతని వద్ద ఉన్న ల్యాప్‌టాప్‌తో పాటు డ్యాకుమెంట్లను సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం నవీపేట్, మాక్లూర్ ఎస్‌బీ ఏఎస్సై లక్ష్మణ్‌ను సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌కు తరలించారు. మాక్లూర్, నవీపేట్ పరిధిలో పాస్‌పోర్టు విచారణలో ఆయన సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయకుండానే పాస్‌పోర్టుకు ఆన్‌లైన్ చేసినట్లు సీఐడీ అధికారుల విచారణలో తేలింది. దీంతో ఏఎస్సై లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిసింది. ఈ కేసులో లక్ష్మణ్‌ను సీఐడీ అధికారులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తారా.. లేక విచారించి వదిలేస్తారా అనే చర్చ పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. పాస్‌పోర్టు ఏజెంట్ సుభాష్, ఎస్‌బీ ఏఎస్సైను అరెస్ట్ చేయడంతో ట్రావెల్స్ యాజమాన్యాల్లో గుబులు మొదలైంది. కేసులో కోరుట్ల, భీమ్‌గల్, హైదరాబాద్‌తో పాటు పలుచోట్ల సీఐడీ అధికారులు తనిఖీలు చేసి 90 మంది నకిలీ సర్టిఫికెట్‌లతో పాస్‌పోర్టులు పొందారని గుర్తించినట్లు తెలుస్తోంది. ఇందులో 14 మందిని అరెస్ట్ చేసినట్లు సమాచారం. కాగా మరో 30 మంది విదేశాలకు వెళ్లినట్లు సీఐడీ అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది.

పల్లెల్లో ఇక ప్రత్యేక పాలన..!

- నేటితో ముగియనున్న పాలకవర్గాల పదవీకాలం
- ప్రత్యేకాధికారుల నియామకాలు పూర్తిచేసిన సర్కారు



సాక్షి, కామారెడ్డి: పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం బుధవారంతో ముగియనుంది. గురువారం నుంచి పాలన ప్రత్యేక అధికారుల చేతుల్లోకి వెళ్లనుంది. జిల్లాలో 526 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీ జనాభా, పరిధులను పరిగణనలోకి తీసుకుని ప్రత్యేకాధికారులను నియమించారు.

2019 జనవరి 21, 25, 30 తేదీలలో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఫిబ్రవరి 1 న పాలక వర్గాలు బాధ్యతలు చేపట్టాయి. ఐదేళ్ల పదవీ కాలం ముగియకముందే ఎన్నికలను నిర్వహించాల్సి ఉంది. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, నెల వ్యవధిలోనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధంగా లేకపోవడంతో వాయిదాకే మొగ్గు చూపారు. అలాగే రాష్ట్రంలో బీసీ జన గణన చేపట్టాలని సర్కారు యోచిస్తోంది. ఆ ప్రక్రియ పూర్తయ్యాక కొత్త రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించాలని నిర్ణయించింది. ఇప్పటికే అధికారుల జాబితాలనూ రూపొందించారు.

రేపటినుంచి మాజీలు..

సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్, వార్డు సభ్యులందరూ గురువారం నుంచి మాజీలు కాబోతున్నారు. వీరిలో తిరిగి పోటీ చేయాలని చాలా మంది ఉవ్విళ్లూరారు. కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రిజర్వేషన్లు రెండు పర్యాయాలు కొనసాగుతాయి. దీంతో కొందరు తిరిగి పోటీ చేయాలని అనుకున్నారు. అయితే చిన్న పంచాయతీల్లో సర్పంచ్‌లు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పదవీ కాలం ఎప్పుడు ముగిసిపోతుందా అని ఎదురుచూసిన వారూ ఉన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో కుల గణన చేపట్టి, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల మార్పు కోసం చట్ట సవరణ చేసే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. దీంతో రిజర్వేషన్లు మారే అవకాశాలున్నాయి.

'ధరణి'లో సదుపాయాలు కల్పించండి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న 'ధరణి' ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్ : జిల్లాకేంద్రంలోని రామారెడ్డిరోడ్డులోగల రాజీవ్ స్వగృహ ధరణి వెంచర్‌లో కనీస వసతులు కల్పించాలని ధరణి టౌన్‌షిప్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. రాజీవ్ స్వగృహ ధరణి ప్లాట్లు వేలం వేసే సమయంలో కనీస వసతులు కల్పిస్తామని కలెక్టర్ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికీ అక్కడ కనీస వసతులు లేవన్నారు. ముందుగా ప్రకటించిన ప్రకారం కనీస వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాజనర్సింహారెడ్డి, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, ప్రతినిధులు సాయిలు, కిషన్, నరేష్, వసంత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలి డబ్బుల కోసం ఆందోళన

నిజాంసాగర్: ఉపాధి హామీ కూలీ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని పోస్టాఫీస్ వద్ద నర్వ గ్రామానికి చెందిన కూలీలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి పనులు చేసి పది నెలలు కావస్తున్నా కూలి డబ్బులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఆసరా పెన్షన్లు పంచుతున్నారని, ఉపాధి కూలి డబ్బులు మాత్రం ఇవ్వడం లేదంటూ బీపీఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్పీఎం అమర్‌సింగ్ కూలీలతో మాట్లాడారు. కూలి డబ్బులు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కూలీలు ఆందోళన విరమించారు.

ఆందోళనలో గ్రామ ఉప సర్పంచ్ నవీన్‌గౌడ్, నాయకులు భూమాగౌడ్, డాకయ్య, మల్లయ్య, నామ అంజయ్య, ఎర్రారం కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



పోస్టాఫీస్ వద్ద నిరసన తెలుపుతున్న నర్వ గ్రామ ఉపాధి కూలీలు

క్లుప్తంగా

వాచ్‌టవర్ పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కోమట్‌పల్లి అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వాచ్ టవర్‌ను మంగళవారం సాయంత్రం ఢిల్లీ నుంచి వచ్చిన అరుణ్, జాన్సన్‌తో ముగ్గురు అటవీ శాఖ బృందం సభ్యులు పరిశీలించారు. నాగిరెడ్డిపేట రేంజ్ పరిధిలోని కోమట్‌పల్లి శివారులో ఉన్న దట్టమైన అటవీ ప్రాంతంలో అటవీశాఖ అధికారులు గత కొంతకాలం క్రితం వాచ్ టవర్‌ను నిర్మించారు. వాచ్‌టవర్‌పై నుంచి అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. టవర్ పైనుంచి 20 కిలోమీటర్ల పరిధిలో ఏం జరుగుతుందో తెలుసుకోవచ్చని, అగ్ని ప్రమాదాలు, కలప అక్రమరవాణాను గుర్తించవచ్చని వారు తెలిపారు. టవర్ నిర్మాణంపై ఢిల్లీ బృందం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. వారి వెంట సీసీఎఫ్ సైదులు, ఎఫ్‌డీవో గోపాల్‌రావు, ఎఫ్ఆర్‌వో రమేశ్, ఓంకార్, అటవీశాఖ సిబ్బంది తదితరులున్నారు.

నిధుల వినియోగంపై పీహెచ్‌సీలో సమావేశం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ(హెచ్‌డిఎస్) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ అభివృద్ధికి మంజూరైన నిధుల వినియోగంపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో ఎంపీపీ రాజ్‌దాస్, జడ్పీటీసీ మనోహర్ రెడ్డి, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో శోభారాణి, పీహెచ్‌సీ డాక్టర్ సృజన్, నాగిరెడ్డిపేట ఎంపీడవో రఘు, నాగిరెడ్డిపేట, గోపాల్‌పేట సర్పంచ్‌లు సునీతరెడ్డి, వంజరి సునీత తదితరులున్నారు.

ప్రయోగాలతో సత్ఫలితాలు



మాచారెడ్డి : విద్యార్థులు ప్రయోగాల ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చని కామారెడ్డి రోటరీ క్లబ్ అధ్యక్షుడు పోలబోయిన సత్యం అన్నారు. మంగళవారం పాల్వంచ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురు విద్యా సంస్థల చైర్మెన్ గురు వేందర్ రెడ్డి సహకారంతో రూ. 25వేల రూపాయల విలువైన సైన్స్ పరికరాలు అందించారు. రోటరీ క్లబ్ కార్యదర్శి రాజనర్సింహారెడ్డి, ఫౌండేషన్ చైర్మన్ కాశీనాథం, కాశీనాథ్ రావు, గంగారెడ్డి, కృష్ణమూర్తి, లక్ష్మీపతి, పాఠశాల హెచ్ఎం గోవర్ధన్ రెడ్డి తదితరులున్నారు.

పేరుకే వైద్య విధాన పరిషత్

- విలీనమైన ఆస్పత్రుల్లో సిబ్బంది నియామకం లేదు
- వైద్యారోగ్యశాఖ పరిధిలోని వారితోనే వైద్య సేవలు
- ప్రస్తుత ప్రభుత్వం బడ్జెట్ కేటాయిస్తే పోస్టుల భర్తీకి అవకాశం

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం వైద్యారోగ్యశాఖ పరిధిలోని సామాజిక ఆస్పత్రులను వైద్య విధాన పరిషత్‌లో విలీనం చేసింది. వైద్య నిపుణులు, సిబ్బంది నియామకానికి ప్రతిపాదనలు రూపొందించి నిధులు కేటాయించకపోవడంతో వైద్యారోగ్యశాఖ పరిధిలోని వైద్యులు, సిబ్బందితోనే సేవలందిస్తున్నారు.



మోర్తాడ్‌లోని సామాజిక ఆస్పత్రి భవనం

మోర్తాడ్(బాల్కొండ): జిల్లాలోని మోర్తాడ్, ధర్పల్లి, డిచ్‌పల్లి, బాల్కొండ, నవీపేట్, వర్నిలోని 30 పడకల ఆస్పతులతోపాటు ఆర్మూర్‌లోని వంద పడకల ఆస్పత్రిని గత ప్రభుత్వం వైద్య విధాన పరిషత్‌లో విలీనం చేసింది. వైద్య విధాన పరిషత్‌లో విలీనమైన ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన వైద్య నిపుణులు, సిబ్బంది నియామకం కోసం ప్రతిపాదనలు రూపొందించారు. భీమ్‌గల్ ఆస్పత్రి నిర్మాణంలో ఉండడంతో ఇక్కడ పోస్టుల భర్తీకి ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

2023–24 ఆర్థిక సంవత్సరంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులను కేటాయించకపోవడంతో పోస్టుల భర్తీ పెండింగ్‌లో పడింది. నిధులు లేకుండా నియామకాలు చేపడితే వేతనాల చెల్లింపు ఎలా అనే సందేహంతో వైద్యులు, సిబ్బంది పోస్టుల భర్తీని చేపట్టలేకపోయారు. వైద్య విధాన పరిషత్‌లో విలీనం చేసిన తరువాత పోస్టులను భర్తీ చేయకపోవడంతో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని వైద్యులు, ఉద్యోగులతోనే సేవలందిస్తూ నెట్టుకువస్తున్నారు. ఫలితంగా మెరుగైన వైద్య సేవలు ఇంకా అందుబాటులోకి రాకుండాపోయాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టే బడ్జెట్‌లో వైద్య విధాన పరిషత్‌కు నిధులను కేటాయిస్తే పోస్టుల భర్తీ ప్రక్రియ ముందుకుసాగే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులపై దృష్టి సారించి పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సిబ్బంది నియామకం ఇలా..

30 పడకల ఆస్పత్రుల్లో 14 మంది వైద్య నిపుణులు, 18 మంది సిబ్బంది, వంద పడకల ఆస్పత్రిలో 48 మంది వైద్యులు, 73 మంది సిబ్బందిని నియమించాల్సి ఉంది. జిల్లాలో అన్ని ఆస్పత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బంది కలిపి 313 పోస్టులకు నోటిఫికేషన్‌ను జారీ చేయాలని ప్రతిపాదించారు.

నిధులు కేటాయిస్తేనే..

వైద్య విధాన పరిషత్‌కు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తేనే వైద్యులు, సిబ్బంది నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేసి పోస్టులను భర్తీ చేస్తాం. పోస్టులను భర్తీ చేయడానికి ప్రతిపాదనలను ఎప్పుడో సిద్ధం చేశాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది.

– డాక్టర్ శివశంకర్, వైద్య విధాన పరిషత్ జిల్లా అధికారి

వరిలో సస్యరక్షణ చర్యలు పాటించాలి



మదన్‌హిప్పర్గాలో పంటను పరిశీలిస్తున్న అధికారి



గాంధారి మండలంలో..



మల్కాపూర్‌లో..

మద్నూర్(జుక్కల్) : యాసంగిలో సాగు చేస్తున్న వరిలోసస్యరక్షణ చర్యలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి పంటలో వరిలో కాండం తొలిచే పురుగును నియంత్రించాలని సూచించారు. డోంగ్లీ మండలంలోని మదన్‌హిప్పర్గా శివారులోని యాసంగిలో సాగుచేస్తున్న వరి పంటను మంగళవారం ఆమె వ్యవసాయ అధికారులు, రైతులతో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం వరిలో కాండం తొలిచే పురుగు, రెక్కల పురుగులను గమనించామన్నారు. దీని నివారణకు ముందుగా నారుమడిలో కార్బోఫ్యురాన్ 3జీ గుళికలు లేదా ఫిప్రోనిల్ 0.3 గుళికలు 600 గ్రాములు వేసుకోవాలని ఆమె సూచించారు. నారుమడిలో వేయకుంటే 15 రోజుల తర్వాత లేదా పిలక దశలో కార్బోఫ్యురాన్ 3జీ 10 కిలోలు లేదా కార్టాప్‌హైడ్రో క్లోరైడ్ 4జీ 8 కిలోలు ఎకరాకి ఇసుకలో కలిపి చల్లుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో రాజు, ఏఈవో సమ్రీన్, రైతులు పాల్గొన్నారు.

గాంధారిలో..

గాంధారి(ఎల్లారెడ్డి) : మండల పరిధిలోని వండ్రికల్, మాతుసంగెం గ్రామాల్లో మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి పర్యటించారు. జొన్న, మొక్క జొన్న, శనగ పంటలను పరిశీలించారు. జొన్న, మొక్క జొన్న పంటలో కాండం తొలిచే పురుగు, కత్తెర పురుగు ఆశించింగా వాటి నివారణకు సంబంధిత రైతులకు పలు సూచనలు, సలహాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవో నరేష్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

మొగి పురుగును నియంత్రించాలి

బీబీపేట : వరి పొలాల్లో ప్రస్తుతం ఉన్నటువంటి కాండం తొలుచు పురుగు, మొగి పురుగును నియంత్రించడానికి రైతులు పలు రకాల చర్యలు తీసుకోవాలని ఏఈవో రాఘవేంద్ర అన్నారు. మంగళవారం బీబీపేట మండల కేంద్రంతో పాటు మల్కాపూర్, ఉప్పర్‌పల్లి గ్రామాంలోని వరి పంటలను పరిశీలించారు. వరి పంటలో మొగి పురుగును గుర్తించారు. దాని నివారణకు వరి నాటిన 20 రోజులలోపు కారటప్ హైడ్రోక్లోరైడ్ 4 జి గుళికలు ఎకరానికి 8 కిలోల చొప్పున ఇసుకతో కలిపి వేసినచో మొగి పురుగును నియంత్రణ చేసుకోవచ్చని రైతులకు సూచించారు. 20 రోజుల దాటిన వరికి కార్టప్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం ఎస్‌పీ మందును ఎకరానికి 400 గ్రాములు, లేదా క్లోరాంతనిలిప్రోల్ 60 ఎంఎల్ లేదా టెట్రానిలిప్రోలు 100 ఎంఎల్ ఎకరానికి పిచికారి చేయాలని తెలిపారు. పొలాల గట్ల మీద కలుపు వల్ల, అధిక యూరియా వాడకం వల్ల అగ్గి తెగులు కూడా కొన్ని చోట్ల ఆశించిందని దాని నివారణకు ట్రియసైక్లోజోల్ 120 గ్రాములు ఎకరానికి పిచికారి చేయాలని సూచించారు. ఆయన వెంట రైతులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులను ఇప్పించాలి



సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : పెండింగ్‌లో ఉన్న బిల్లులను తమకు సకాలంలో చెల్లించేలా ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చొరవ చూపాలని నాగిరెడ్డిపేట సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు కృష్ణ కోరారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాజ్‌దాస్, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎంపీడీవో రఘు, ఎంపీవో శ్రీనివాస్ సర్పంచ్‌లను శాలువాలతో కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లతోపాటు మండల పరిషత్ కార్యాలయ సూపరిండెంట్ వినోద్, సీనియర్ అసిస్టెంట్ వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కొనలను తుంచి నాటు వేయాలి'



మాచారెడ్డి : ఈ సీజన్‌లో ఆలస్యంగా వరి నాటు వేసే రైతులు నారు కొనలను తుంచి వేసి నాటు వేయాలని మాచారెడ్డి వ్యవసాయాధికారి రమ్యశ్రీ సూచించారు. అలావేస్తే కొద్ది రోజుల్లోనే వరి పైరు ఏపుగా పెరుగుతుందన్నారు. చాలా గ్రామాల్లో కాండం తొలిచే పురుగు ఆశిస్తుందన్నారు.దాని నివారణకు గాను 800 గ్రాముల కార్బో ఫ్యూరన్ 3జీ గులికలను పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు రైతులు ఉన్నారు.

సర్పంచ్‌కు సన్మానం



బాన్సువాడ రూరల్ : నూతన జీపీగా ఏర్పడ్డ తర్వాత బోర్లం క్యాంప్ తండాను సర్పంచ్ నాన్కుబాయి పీర్యానాయక్ ఐదేళ్లలో అభివృద్ధి పథంలో నడిపారని పేర్కొంటూ ఆమెను, వార్డు సభ్యులను గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాందీన్ సుభాష్, షబ్బీర్, అజ్మత్, రజాఖ్, అంజనేయులు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడాకారులకు సన్మానం



భిక్కనూరు : హాకీ అండర్–14 పాల్గొన్న మండలంలోని జంగంపల్లి గ్రామంలోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులను మంగళవారం సర్పంచ్ నర్సింలుయాదవ్ సన్మానించారు. రాష్ట్రస్థాయి హాకీ టోర్నీలో పాల్గొని ప్రతిభ చూపిన హారతి, మేఘన, లాస్య రేఖ, వైష్ణవిని సన్మానించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం రాజేంద్రప్రసాద్, జ్యోతిబాపూలే ప్రిన్సిపాల్ ప్రమోద వార్డు సభ్యులు సంతోష్, ప్రదీప్, రమేష్, ఉపాధ్యాయులు గఫూర్‌శిక్షక్ తదితరులున్నారు.

సేవలో భాగం కావాలి



బాన్సువాడ రూరల్ : సామాజిక సేవ విద్యార్థుల జీవితంలో భాగం కావాలనే ఉద్దేశంతో ఎన్ఎస్ఎస్ శిబిరాలు ప్రారంభించినట్లు బాన్సువాడ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పాండురంగ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని సోమేశ్వర్, దేశాయిపేట్ గ్రామంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లతో కలిసి ఎన్ఎస్ఎస్ యూనిట్–1 శీతాకాల శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్‌లు రుక్మిణి, యాదాగౌడ్, అధ్యాపకులు అబ్దుల్ జలీల్, స్వరూప్‌కుమార్ తదితరులున్నారు.

జంతువులను ప్రేమించాలి



మద్నూర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

మద్నూర్(జుక్కల్) : జంతువులను హింసించకుండా ప్రేమించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సింహారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పశువైద్యశాలలో మంగళవారం ఆయన జంతు సంక్షేమ వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. పశు వైద్యశాలకు వచ్చిన 20 కుక్కలకు రెబీస్ టీకాలు వేశారు. అనంతరం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జంతు సంరక్షణపై వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ సంజయ్‌కుమార్, రోహిత్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, పశువైద్యుడు విజయ్, రైతులు ఉన్నారు.

మృతి చెందిన వైద్యులకు నివాళి



కామారెడ్డి టౌన్ : దేశవ్యాప్తంగా కోవిడ్ కాలంలో ప్రజలకు వైద్య సేవలందించి అమరవీరులైన వైద్యుల కోసం ఐఎంఏ కామారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం రాత్రి సిరిసిల్లారోడ్ నుంచి జిల్లా కేంద్ర ఆస్పత్రి వరకు ర్యాలీ చేపట్టి నివాళులు అర్పించారు. దేశ వ్యాప్తంగా వెయ్యి మందికి పైగా వైద్యులు కోవిడ్ కాలంలో మృతి చెందారని ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వెంకటేశ్వర్‌గౌడ్, రమేష్, నవీన్, సంతోష్, అరవింద్‌గౌడ్, శ్రీలీల, శ్రీకాంత్, విజయ్‌కుమార్, తదితరులున్నారు.

మెజీషియన్‌కు అవార్డు



భిక్కనూరు : మండలంలోని కంచర్లగ్రామానికి చెందిన మెజీషియన్ సంతోష్‌కు నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన అమ్మనాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అబ్దుల్ కలాం అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మనాన్న ఫౌండేషన్ చైర్మన్ అంజనేయులు, సాయి అనాథాశ్రమం రాష్ట్ర చైర్మన్ అశోక్‌కుమార్, బజార్‌హత్నూర్ ఎంపీడీవో రాధ, వేంకూర్ సర్పంచ్ దిగంబర, విండో వైస్ చైర్మన్ చాకేటి లక్ష్మన్న తదితరులున్నారు.

ఆలయానికి స్థలం విరాళం



బాన్సువాడ రూరల్ : మండలంలోని హన్మాజీపేట్ గ్రామంలో రుక్మిణి, విఠలేశ్వర మందిర నిర్మాణానికి పలువురు గ్రామస్తులు 120 గజాల స్థలాన్ని విరాళంగా అందించినట్లు సర్పంచ్ బోనాల సుభాష్ తెలిపారు. గ్రామానికి చెందిన కములుగారి పరివారానికి చెందిన లక్ష్మణ్, రంజిత్, రాంపటేల్ తమ సొంత స్థలాన్ని విరాళంగా అందించారన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన సదస్సు



దోమకొండ : కుష్టువ్యాధి నిర్మూలనకు మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కుష్టువ్యాధి నిర్మూలనకు డిప్యూటీ పారామెడికల్ అధికారులు జీవన్, రాధాకిషన్‌లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది జ్యోతి, పాఠశాల హెచ్ఎం సుజాత ఉన్నారు.

క్రైం కార్నర్

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



కుర్మ లక్ష్మయ్య (ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోచారం గ్రామానికి చెందిన రైతు కుర్మ లక్ష్మయ్య(47) గడ్డికోత యంత్రంతో పొలంలో గడ్డి కోస్తుండగా విద్యుత్‌షాక్‌తో మంగళవారం మృతి చెందాడు. మృతుడు లక్ష్మయ్య అదే గ్రామానికి చెందిన టేకులపల్లి గోపాల్ రెడ్డి వ్యవసాయభూమిని గతకొంతకాలంగా కౌలుకు చేస్తున్నాడు. యంత్రంతో గడ్డికోస్తుండగా విద్యుత్‌వైరు తగిలి లక్ష్మయ్య కిందపడిపోయాడు. అక్కడే ఉన్న కుటుంబ సభ్యులు గమనించి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, లక్ష్మయ్య మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య మల్లవ్వ, ఇద్దరు కొడుకులు ఉన్నారు. మల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని ముదక్‌పల్లికి చెందిన గంగుబాయి (73) జిల్లాకేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై గంగాధర్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తన కుమార్తె శాంతతో కలిసి గ్రామంలో నివాసం ఉంటున్న గంగుబాయికి కాళ్లు, చేతులు పని చేయకపోవడంతో నడవలేని స్థితిలో ఉంది. బీడీ తాగే అలవాటు ఉన్న ఆమె.. ఈనెల 28న ఇంట్లో ఎవరూ లేని సమయంలో బీడీ వెలిగించుకునేందుకు పొయ్యి వద్దకు వెళ్లగా నిప్పురవ్వ ఆమె కప్పుకున్న దుప్పటిపై పడి మంటలు అంటుకున్నాయి. గంగుబాయి అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి మంటలు ఆర్పేశారు. అప్పటికే 70శాతం కాలిన గాయాలతో గంగుబాయి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతిచెందింది. మృతురాలి కుమార్తె శాంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

గూడ్స్‌రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి..

ఖలీల్‌వాడి: జాన్కంపేట్ రైల్వే గేటు వద్ద గూడ్స్‌రైలు ఢీకొట్టిన ఘటనలో గుర్తు తెలియని వ్యక్తి (45) మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే 87126 58591, 94409 99341 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కాలువ పక్కన మహిళ మృతదేహం

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాంగ్ర శివారులో రైల్వేపట్టాల వెంబడి కాలువ పక్కన గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మృతురాలి వయస్సు 55 నుంచి 60 సంవత్సరాలు ఉంటుందని, శరీరంపై గులాబీరంగు చీర, ముదురు నీలం రంగు జాకెట్ ఉన్నాయన్నారు. మృతదేహం సమీపంలో తంబాకు సంచి, సున్నం డబ్బా లభించాయని, మహారాష్ట్రకు చెందిన మహిళ అయి ఉంటుందని భావిస్తున్నామన్నారు. 5 నుంచి 10 రోజుల మధ్య రైలులో నుంచి పడి గాయాలై మృతి చెందినట్లు అనుమానంగా ఉందన్నారు. వివరాలకు నాల్గో టౌన్ పోలీసులను (87126 59840, 87126 59719) సంప్రదించాలన్నారు.

వీడీసీ సభ్యుల బైండోవర్

డిచ్‌పల్లి: మండలంలోని కొరట్‌పల్లి, ధర్పల్లి మండలం మైలారం గ్రామాలకు చెందిన వీడీసీ సభ్యులను డిచ్‌పల్లి పోలీసులు తహసీల్దార్ రాజేందర్ ఎదుట మంగళవారం బైండోవర్ చేశారు. ఎస్సై యూ.మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొరట్‌పల్లి, మైలారం గ్రామాల మధ్య ఉన్న వాగు విషయంలో రెండు గ్రామాల వీడీసీ సభ్యులు తరచూ గొడవ పడుతున్నారు. మళ్లీ గొడవ జరిగే అవకాశం ఉండడంతో మైలారం గ్రామానికి చెందిన 12 మంది వీడీసీ సభ్యులను, కొరట్‌పల్లికి చెందిన 13 మంది వీడీసీ సభ్యులను ముందు జాగ్రత్తగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి రూ.2లక్షల పూచీకత్తుపై వదిలేశారు. అనంతరం రెండు గ్రామాల వీడీసీ సభ్యులకు డిచ్‌పల్లి సీఐ మల్లేశ్ కౌన్సిలింగ్ ఇచ్చారు. వీడీసీ అనేది చట్టబద్ధమైన వ్యవస్థ కాదని, గ్రామాల్లో వీడీసీ సభ్యులుగా ఉన్నా, వీడీసీ పేరుతో సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీడీసీ ఆగడాలపై బాధితులు, ప్రజలు నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని సీఐ అన్నారు.

సైబర్ మోసగాళ్లకు చిక్కొద్దు




అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి

మాక్లూర్: సైబర్ మోసగాళ్ల వలకు చిక్కొద్దని సైబర్ క్రైం డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు కాకతీయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయ్) ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వేణుగోపాల్‌రెడ్డి సైబర్ మోసాలు, వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. టెలికాం సర్వీసులు, ట్రాయ్ యాప్‌లు, 5జీపై ట్రాయ్ జాయింట్ అడ్వైజర్ కేవీ సురేశ్‌బాబు అవగాహన కల్పించారు. సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ చింతరాల భిక్షం, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శాలువకుమార్ రాజా, వైస్ ప్రిన్సిపల్ సాయారెడ్డి, హెచ్‌వోడీ ఈసీఈ మహిపాల్, బీఎస్ఎన్ఎల్ జీఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే హత్య

- ఘటనకు దారితీసిన వివాహేతర సంబంధం
- కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని సోమారం శివారులో ఈనెల 21వ తేదీన జరిగిన ముదాం శంకర్ హత్య కేసును పోలీసు ఛేదించారు. వివాహేతర సంబంధమే హత్యకు దారితీసిందని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. తాడ్వాయి పోలీస్‌స్టేషన్‌లో కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం వెల్లడించారు. తాడ్వాయికి చెందిన ముదాం శంకర్ భార్య లక్ష్మితో అదే గ్రామానికి చెందిన సుర్కంటి మనోహర్‌రెడ్డి కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. భర్తను అడ్డుతొలగించుకోవాలనుకున్న లక్ష్మి.. శంకర్‌ను హత్య చేయాలని మనోహర్‌రెడ్డికి సూచించింది. దీంతో మనోహర్‌రెడ్డి సోమారం గ్రామానికి చెందిన జంక శ్రీనివాస్‌తో పాటు అతడి భార్య యాదమ్మను సంప్రదించాడు. శంకర్‌ను హత్య చేస్తే రూ.2లక్షలు ఇస్తానని ఒప్పందం చేసుకున్నాడు. పక్కాప్లాన్‌తో శ్రీనివాస్, యాదమ్మ ఈనెల 21న బ్రాహ్మజివాడి శివారులోని సిద్దులగుట్ట వద్దకు శంకర్‌ను రప్పించి ఇనుపరాడ్‌తో దాడిచేసి హతమార్చారు. రోడ్డు ప్రమాదంలో శంకర్ మృతి చెందినట్లు నమ్మించేందుకు సోమారం శివారులో మృతదేహాన్ని పారేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఎస్పీ ఆదేశాల మేరకు రెండు టీంలుగా ఏర్పడి కేసు దర్యాప్తు చేపట్టి నిందితులను మంగళవారం ఉదయం కామారెడ్డి బస్టాండ్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో సర్కంటి మనోహర్‌రెడ్డి, ముదాం లక్ష్మి, జంక శ్రీనివాస్, జంక యాదమ్మను రిమాండ్‌కు తరలించనట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సదాశివనగర్ సీఐ రామన్, తాడ్వాయి ఎస్సై ఆంజనేయులు, ఏఎస్సై సంజీవులు, సిబ్బంది రమేశ్‌గౌడ్, నిరంజన్, ఇర్ఫాన్, సాయిబాబా, అనిత, జయ పాల్గొన్నారు. ముదాం శంకర్‌ను హత్య చేయాలని పథకం రచించిన సుర్కంటి మనోహర్‌రెడ్డి అతడి పేరుపై రూ.50లక్షల ఇన్సురెన్స్ చేయించాడు. రోడ్డు ప్రమాదంలో శంకర్ మృతి చెందినట్లు నమ్మించి ఇన్సురెన్స్ డబ్బులు కాజేయాలని ప్లాన్ వేశాడు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

దోమకొండ: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ దోమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం పట్టుబడ్డ ఇద్దరికి కామారెడ్డి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై మురళి తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపిన చాంద్‌పాషా, ఒగ్గు రాజమల్లుకు న్యాయమూర్తి జైలుశిక్షతో పాటు రూ.500 జరిమానా విధించారన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జక్రాన్‌పల్లి: మండలంలోని సికింద్రాపూర్ గ్రామానికి చెందిన అప్పాల లక్ష్మి ఈ నెల 28న తన ఇంటికి తాళం వేసి జలాల్‌పూర్‌లోని తల్లి గారింటికి వెళ్లింది. 29వ తేదీన దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి నాలుగున్నర తులాల బంగారం ఎత్తుకెళ్లారు. ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించిన చుట్టుపక్కల వాళ్లు లక్ష్మికి సమాచారం అందించారు. ఇంటికి చేరిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.